## క్లుప్తంగా

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన అదనపు కలెక్టర్

**జగిత్యాల:** టీఎన్జీవోలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో సందర్శకులకు మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్ లత అన్నారు. కలెక్టరేట్‌లో టీఎన్జీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, ట్రెస్సా అధ్యక్షుడు వకీల్, అమరేందర్‌రెడ్డి, హరి అశోక్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### హక్కులను స్వేచ్ఛగా వినియోగించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సలీం

**ఇబ్రహీంపట్నం:** హక్కులను స్వేచ్ఛగా వినియోగించాలని వాటికి భంగం కలిగించకూడదని మానవ హక్కుల హెల్ప్ అసోసియేషన్ చైర్మన్ ఎండీ సలీం అన్నారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు హక్కుల స్వేచ్ఛ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాజ్యాంగం మనకు స్వేచ్ఛగా బ్రతకడానికి ఎన్నో హక్కులను అందించిందని అన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్‌రావు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరాంకుషం నర్సయ్య, ఎండీ సమీర్, హుస్సేన్, ప్రిన్సిపాల్ ప్రభాకర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఈ పాస్ ద్వారానే ఎరువులు అమ్మాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో రాజ్‌కుమార్

**ఇబ్రహీంపట్నం:** రైతులకు ఎరువులను ఈపాస్ యంత్రాల ద్వారానే అమ్మాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, రశీదు బుక్కులు, ఈపాస్ యంత్రాలను పరిశీలించారు. ప్రతి ఎరువుల దుకాణాలలో స్టాక్ బోర్డులను పెట్టి ధరలను కూడ రాయాలని తెలిపారు. ఎరువులు, విత్తనాలు కొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదులను ఇవ్వాలని నకిలీ ఎరువులు, విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ సంస్థ యజమాని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రం స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

**గొల్లపల్లి:** మండలంలోని ఇబ్రాజీపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం గ్రామ రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని ఐకేపీ సెంటర్ నిర్వహిస్తున్న ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కందుకూరి తిరుపతి అనే వ్యక్తి ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేసుకున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకుని తిరిగి ధాన్యం కేంద్రానికి అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రవీందర్, ఐలయ్య, రవీందర్, జలపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**చెక్కు అందజేత**

**పెగడపల్లి:** మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన మానుపాటి సాగర్‌కు రూ. 21 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్సీ ఎల్ రమణ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

**నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం**

**జగిత్యాల:** కెమిస్ట్రీ, కామర్స్ ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రారంభమవుతుందని ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు మైనార్టీ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు హాజరు కావాలని పేర్కొన్నారు.

**నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం**

**మెట్‌పల్లి:** పట్టణ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం స్థానిక విశ్వకర్మ భవనంలో జరిగింది. అధ్యక్షుడిగా కొండ మురళీ, ఉపాధ్యక్షుడిగా ఎదులాపురం కుమార్, కార్యదర్శిగా ఇంద్రాల ఈశ్వర్, కోశాధికారిగా మద్దెనపల్లి స్వామి, కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు.

# ప్రారంభోత్సవాలే... పనులేవీ?

- అద్దె భవనాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు
- అరకొర వసతులతో నెట్టుకొస్తున్న వైద్య సిబ్బంది



సిరికొండలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం భవనం

**కథలాపూర్:** గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలుంటే గ్రామీణ ప్రజలకు మంచి వైద్యం అందుతుందని వాటికోసం నిధులు మంజూరు చేశారు. రెండేళ్ల క్రితం పనులను ప్రారంభించిన ఇప్పటికీ పూర్తికాకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్య ఉపకేంద్రాల పక్కా భవనాల పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయించేందుకు పాలకులు, ఉన్నతాధికారులు చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ఆరోగ్య ఉపకేంద్రాల లక్ష్యమిదే..**

గ్రామీణ ప్రజలు అనారోగ్యం పాలైతే మండలకేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేవారు. ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇలాంటి పరిస్థితులను తొలగించేందుకు, గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేసింది. మూడు, నాలుగు గ్రామాలకు ఒక ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో జ్వరం, దగ్గు, జలుబు, చిన్న పిల్లలకు, మహిళలకు ఆయా ఆరోగ్య ఉపకేంద్రాల్లోనే సిబ్బంది వైద్యసేవలందిస్తారు. ఈ కేంద్రాల్లో పరీక్షించిన తర్వాత వైద్యం అందించడం సాధ్యం కాకపోతే మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీలకు రిఫర్ చేస్తారు.

**పనుల్లో పురోగతి కరువు**

కథలాపూర్, అంబారిపేట గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రాలు 8 ఉన్నాయి. రెండేళ్ల క్రితం మండలంలోని సిరికొండ, తక్కళ్లపెల్లి, అంబారిపేట, దూలూర్, కథలాపూర్ గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనం కోసం రూ. 15 లక్షలు కేటాయించారు.

**పనుల పరిస్థితి ఇలా...**

సిరికొండ, దూలూర్ గ్రామాల్లో స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. తక్కళ్లపెల్లిలో పిల్లర్ల గుంతలకే పరిమితమైంది. అంబారిపేటలో బెడ్ లెవెల్ నిర్మించారు. కథలాపూర్‌లో ఇంకా పనులు ప్రారంభించలేదు. ఫలితంగా ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో వైద్యసిబ్బందితో పాటు చికిత్సల కోసం వచ్చేవారు అవస్థలపాలవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అత్యవసర పనులపై నిర్లక్ష్యం వద్దు



ప్రజలకు వైద్యం అత్యవసరం. ఆరోగ్య ఉపకేంద్రాల్లో అన్ని వసతులుంటేనే గ్రామీణ ప్రజలకు మంచి వైద్యం అందుతుంది. ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల నిర్మాణాలపై ఏళ్లుగా జాప్యం చేయడం సరికాదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికి పనుల పురోగతిపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలి. అసంపూర్తిగా నిర్మాణాలుంటే అందుకు బాధ్యులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి.

– కాసోజి ప్రతాప్, యువకుడు, సిరికొండ

### పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచిస్తాం

కథలాపూర్ మండలంలో ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచిస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పూర్తి చేసేవరకు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– రాజారెడ్డి, డీఈ, వైద్యశాఖ ఇంజినీరింగ్ విభాగం



**సారంగాపూర్:** మండల కేంద్రం నుంచి బట్టపల్లి-పోతారం గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు ఏర్పాటై 17 ఏళ్లు దాటి శిథిలావస్థకు చేరింది. ఇప్పటికీ ఒక్కసారి కూడా రోడ్డు వేయలేదు. కంకర తేలి, గుంతలతో రోడ్డంతా అధ్వానంగా మారి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 2023-24లో రోడ్డు కోసం ప్రభుత్వం 1.50 కోట్లు మంజూరు చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: రాజేందర్
ఏఈ, ఆర్‌అండ్‌బీ,సారంగాపూర్, సెల్‌ఫోన్ నంబర్: 7702353270

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

# ఆశా కార్యకర్తల నిరసన



రాయికల్‌లో ఆశా కార్యకర్తల మానవహారం



ధర్మపురిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

**కోరుట్లరూరల్/ధర్మపురి/రాయికల్/కథలాపూర్/మేడిపల్లి:** తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ వెళ్తున్న ఆశా కార్యకర్తలను మంగళవారం ముందస్తుగా అరెస్టు చేయడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. కోరుట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట, రాయికల్ పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద ఆశా కార్యకర్తలు మానవహారం చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. కథలాపూర్‌లో కోరుట్ల-వేములవాడ రోడ్డుపై తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై ధర్నా చేపట్టారు. మేడిపల్లి తహసీల్దార్ ఆఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లకు తమ డిమాండ్లను పేర్కొంటూ వినతిపత్రాలు అందించారు. కార్యక్రమాల్లో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### చేతివృత్తుల రక్షణకే ఉలిబాడిస ఉద్యమం

**జగిత్యాలటౌన్:** చేతివృత్తులను కాపాడుకోవడమే ఉలిబాడిస ఉద్యమ ప్రధాన లక్ష్యమనిఉలిబాడిస ఉద్యమ జాతీయ అధ్యక్షుడు పున్నమాచార్య అన్నారు. పట్టణంలోని పొన్నాల గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులవృత్తులు కార్పొరేట్ సంస్థల పరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విశ్వకర్మ సమాజానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ఉలిబాడిస ఉద్యమానికి విశ్వకర్మలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతర రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, రంజిత్, ప్రధాన కార్యదర్శి లందర్ పాల్గొన్నారు.

### రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేయాలి

**మల్లాపూర్:** రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ వనతడుపుల నాగరాజు అన్నారు. మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన రుణమాఫీ కాని రైతులతో కలిసి ఆయన జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ కలిసి వినతిపత్రం అందించారు. మొగిలిపేటలో అర్హులైన రైతులు రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. టెక్నికల్ సమస్యతో రుణమాఫీ కాని వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపెల్లి మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### న్యాయవాదుల నిరసన

**కోరుట్ల:** హైదరాబాద్‌లో లాయర్ ఇజ్రాయిల్‌ను హత్య చేయటాన్ని నిరసిస్తూ కోరుట్లలో మంగళవారం లాయర్లు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు, లాయర్లు పాల్గొన్నారు.

**మెట్‌పల్లి:** హైదరాబాద్‌లో ఇజ్రాయెల్ అనే న్యాయవాదిని హత్య చేయడం పట్ల పట్టణంలో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పుప్పాల లింబాద్రితో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

**ప్రతీ ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండాలి**

**రాయికల్:** అందరికీ సీపీఆర్‌పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని, అప్పుడే ప్రాణాలు కాపాడవచ్చని కరీంనగర్‌లోని నగునూర్ ప్రతిమ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సూర్య అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న యువతీ, యువకులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో సీపీఆర్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రమోద్, నాగేందర్, ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్లు రఘుపతి, శ్యామల పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలన**

**సారంగాపూర్:** మండలంలోని నాయికపుగూడెంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో చౌడారపు గంగాధర్ పరిశీలించారు. నిబంధనలకు లోబడి ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి ఉన్నారు.

**ఉపాధి హామీ పనులు..**

**కోరుట్ల రూరల్:** మండలంలోని సర్పరాజ్‌పూర్‌లో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ఓదెల రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. పనిలో నాణ్యత ఉండాలని, కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలని కూలీలకు సూచించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి మాదవి, తదితరులు పాల్గొన్నారు.

**వృద్ధురాలి ఆచూకీ లభ్యం**

**జగిత్యాలక్రైం:** జగిత్యాల కొత్తబస్టాండ్‌లో మూడు రోజుల క్రితం అదృశ్యమైన సరోజన (70) ను సీసీఎస్ ఎస్సై రవీందర్ సోమవారం రాత్రి గుర్తించి పట్టణ పోలీసులకు అప్పగించారు. మూడు రోజుల క్రితం కొత్తబస్టాండ్ నుంచి అదృశ్యమైన వృద్ధురాలి కోసం పట్టణ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీఎస్ ఎస్సై రవీందర్ పట్టణ శివారులోని ఉప్పరిపేటలో ఉన్న వృద్ధురాలిని చేరదీసి పట్టణ పోలీసులకు అప్పగించారు. పట్టణ పోలీసులు కోరుట్లలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పిలిపించి వృద్ధురాలిని అప్పగించారు.

**పేకాట రాయుళ్ల అరెస్ట్**

**జగిత్యాలక్రైం:** జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామ శివారులో రహస్యంగా పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను జగిత్యాల సీసీఎస్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

**నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక**

**ఇబ్రహీంపట్నం:** మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఏడాదిలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై బృందాలు తనిఖీ నిర్వహించాయని, తుది నివేదికను సమర్పించనున్నట్లు పేర్కొన్నాయి.

### నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు

**కథలాపూర్:** మండలంలోని దుంపేట గ్రామానికి చెందిన గుండేటి తనుశ్రీ అనే విద్యార్థిని నవోదయ పాఠశాల సీటు సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. తనుశ్రీ తల్లిదండ్రులు రవికుమార్- పద్మలత ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే. వారి కూతురు తనుశ్రీ వారు విధులు నిర్వర్తిస్తున్న పోసానిపేట ప్రభుత్వ పాఠశాలలోనే చదివించడం విశేషం.

**కోరుట్ల రూరల్:** మండలంలోని ధర్మారం ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థిని రాజోజి యశస్వి జవహర్ నవోదయలో సీటు సాధించింది. ఈ సందర్భంగా యశస్వినిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

### దుంపేటలో తాగునీటి కటకట

**కథలాపూర్:** మండలంలోని దుంపేటలో మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని గ్రామస్తులు మంగళవారం తెలిపారు. అసలే వేసవికాలం.. నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. మండలాధికారులు చొరవ చూపి గ్రామంలో తాగునీటి సరఫరా విషయంలో చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### దుకాణాలు ఖాళీ చేయాలని దేవాదాయ శాఖ ఆదేశాలు

**మెట్‌పల్లి:** పట్టణంలోని ఎడ్మల లక్ష్మారెడ్డి ట్రస్టుకు సంబంధించిన భవనంలో నిర్వహిస్తున్న దుకాణాలను వెంటనే ఖాళీ చేయాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ సూచించారు. మంగళవారం లీజుదారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం ప్రమాదకరంగా మారిందని మున్సిపల్ అధికారులు పేర్కొనడం జరిగిందన్నారు. లీజు గడువు ముగిసినందున వాటిని వెంటనే ఖాళీ చేయాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

### ఎస్సీ వర్గీకరణతో దళితులకు న్యాయం

**సారంగాపూర్:** ఎస్సీ వర్గీకరణతో దళితులకు సరైన న్యాయం జరుగుతుందని అంబేడ్కర్ సంఘాల నాయకులు పూడూరి శోభన్, బదినేపల్లి శంకర్, చాతరాసి లక్ష్మీరాజం అన్నారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై సారంగాపూర్‌లో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కూటికల నితిన్, తిరుపల్లి రాజయ్య, నలువాల బుజ్జయ్య, నలువాల ప్రవీణ్, రాజయ్య, ధర్మయ్య, ఆదిత్య, నవదీప్, మల్లేశ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఫొటో కొట్టు... పౌష్టికాహారం పట్టు**

**కథలాపూర్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోంది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తయారు చేసింది. లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించే సమయంలో ముఖాన్ని ఫొటో కొట్టి ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నట్లుఅంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. ఈ నెల నుంచి మండలంలోని 19 గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇదీ పక్కాగా అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు.

**కొత్త పట్టాలు చేయొద్దు**

**మల్లాపూర్ :** మండలంలోని ఎస్సారెస్పీ గ్రామం నడికుడలో డీ1 పట్టా దరఖాస్తులతో కొత్త పట్టాలు చేయొద్దని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు.తమ గ్రామానికి సంబంధం లేని కొంతమంది డీ1 పట్టాలు సంపాదించి ఆ భూములకు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారన్నారు. తమ గ్రామ పెద్దమనుషులకు తెలియకుండా కొత్తగా వచ్చే డీ1 దరఖాస్తులతో భూ రిజిస్ట్రేషన్లు చేయొద్దని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నారెడ్డి, గంగారాం, రాజేందర్ రెడ్డి, చిన్నయ్య, మల్లేశ్, ఇస్తార్, అశోక్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

**సామాజిక సేవాకార్యక్రమాలు విస్తృతం చేస్తాం**

**మల్లాపూర్:** గ్రామీణ ప్రాంతాలకు లయన్స్‌క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోట రాజారాం అన్నారు. మండలంలోని సిరిపూర్‌లో మంగళవారం నిర్వహించిన లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సేవా కార్యక్రమాలే ఏకైక లక్ష్యంగా లయన్స్‌క్లబ్ పనిచేస్తూ ప్రజలతో మమేకమవుతుందన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులను సన్మానించారు. సమావేశంలో లయన్స్ క్లబ్ రీజియన్ మాజీ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, మాజీ అధ్యక్షుడు కనుక సంజీవ్, ఏనుగు రాంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

### నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడిగా రాజేశ్

**ఇబ్రహీంపట్నం:** నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా వర్షకొండ గ్రామానికి చెందిన సమ్మెట రాజేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పసూనూరి అంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రాచకొండ రవి, కోశాధికారిగా వెల్లుల రమేశ్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**మండల సమాఖ్య అధ్యక్షురాలిగా తేజశ్రీ**

**మల్లాపూర్:** మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఆకుల తేజశ్రీ(మల్లాపూర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐకేపీ(సెర్ప్) కార్యాలయంలో మంగళవారం వీవో అధ్యక్షురాళ్లతో నిర్వహించిన సమావేశంలో సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎండీ.రేష్మ, కోశాధికారిగా మారంపెల్లి సాహిత్య తో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం దేవరాజ్, సీసీలు లక్ష్మీరాజం, రమేశ్, రాజు, స్రవంతి, సభ్యులు పాల్గొన్నారు.

**బెదిరించిన వ్యక్తిపై కేసు**

**సారంగాపూర్:** బీర్‌పూర్ మండలం రేకులపల్లిలో రేకులపల్లి వాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని దూషించి, చంపుతానని బెదిరించిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. రేకుపల్లి గ్రామానికి చెందిన ఎలగందుల అశోక్‌ను అదే గ్రామానికి చెందిన శనిగరపు గంగాధర్ అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపులో అసభ్యకరమైన పదజాలంతో దూషించడంతో పాటు, చంపుతానని బెదిరించాడని బాధితుడు అశోక్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**'పీఎం శ్రీ' ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రారంభం**

**కథలాపూర్:** పీఎం శ్రీ పథకంలో భాగంగా మండలంలోని పోతారంలో ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ఎంఈవో లోకిని శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కిషన్‌రావు, శ్రీనివాస్, నరహరి, వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సేవతోనే గుర్తింపు**

**జగిత్యాల:** సేవతోనే ప్రతీ ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని పశుసంవర్ధక శాఖ అధికారి మనోహర్ అన్నారు. మంగళవారం వీకేబీ ఫంక్షన్‌హాల్‌లో నాన్ గెజిటెడ్ వెటర్నరియన్స్ ఆధ్వర్యంలో ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశువైద్య సంచాలకులు బోనగిరి నరేశ్, జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్, సెక్రటరీ నాగేందర్‌రెడ్డి, గణేశ్, రవి, రవీందర్, ఆనంద్ పాల్గొన్నారు.




ధర్మపురి: మండలంలోని రాజారం ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఎల్ల మ్మ పట్నాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. బైండ్ల వారి దప్పుల చప్పుళ్లతో ఎల్లమ్మతల్లిని కొలిచారు. భక్తులు పూనకాలతో ఊగిపోయారు.




పెగడపల్లి:మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో మంగళవారం వేంకటేశ్వరుని కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకుడు గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతం స్వామివారల ఉత్సవ మూర్తులతో పల్లకిసేవ నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వొరుగల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామచంద్రం, సభ్యులు అన్నదాత గండ్ర వెంకటరావు-ప్రమీల దంపతులు పాల్గొన్నారు.




మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామికి యాదవ కులస్తులు ఉత్సవాలు నిర్వహించారు. నాగవెళ్లి, అగ్నిగుండాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులు అగ్నిగుండంలో నడిచి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేశ్, యూత్ అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు మహేశ్ పూజలు చేశారు.